ముంచెత్తిన వరద

- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- వరదనీటిలో పంట పొలాలు
- పర్యటించిన అధికారులు

కంచిలి:

వరద ముంచెత్తింది. రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు జనావాసాలు, రోడ్లు, పంట పొలాలు పలు చోట్ల నీట మునిగాయి. మండల కేంద్రం కంచిలితోపాటు పలు గ్రామాల పరిధిలో వర్షపు నీరు, వరదనీరు చేరింది. కంచిలిలో ఎస్సీ కాలనీలోని పలు ఇళ్లలోకి ఎగువ నుంచి వచ్చిన వరద నీరు చేరడంతో ఆయా కుటుంబాలు ఆందోళన చెందాయి. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం పరిస్థితిని పరిశీలించారు. అంతకు ముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో కలిసి వర్షాలపై సమీక్షించారు. మఠం సరియాపల్లి పంచాయతీ పరిధి నారాయణబట్టి గ్రామం వద్ద రహదారిపైకి వరద నీరు వచ్చింది. దీనిపై చర్యలు తీసుకోవల్సిందిగా మండల ప్రత్యేకాధికారి జి.రఘునాథ్, ఎంపీడీవో వి.నీరజ ఆదేశించారు. కంచిలి మెయిన్‌రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడింది. అయితే దాన్ని వెంటనే తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు భైరిపురం జంక్షన్‌కు వెళ్లే మార్గంలో వరద నీరు రోడ్డుపైన నిలవడంతో అక్కడ ఉన్న డ్రైనేజ్ ప్లేట్లను తెరిపించి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.


కంచిలి: ఎస్సీ కాలనీలో ఒక ఇంట్లోకి ప్రవేశించిన వరదనీరు


కంచిలి: మెయిన్‌రోడ్డులో పడిన చెట్టుకొమ్మలను పరిశీలిస్తున్న అధికారులు


కంచిలి మెయిన్‌రోడ్డులో నిలిచిన నీటిలో వాహనాల రాకపోకలు

ప్రాజెక్టు పరిశీలన

సోంపేట: మండలంలోని ఎం.జి.పురం పంచాయతీ బాతుపురం గ్రామం వద్దగల పైడిగాం ప్రాజెక్టును తహసీల్దార్ బి.అప్పలస్వామి సోమవారం పరిశీలించారు. ఒడిశాలో అధిక వర్షాలు కురవడంతో ప్రాజెక్టు వద్ద నీటి ఉధృతి పరిస్థితి అంచానా వేశారు. వరద ఉధృతి లేక పోవడంతో ఇబ్బందులు లేవని తెలియజేశారు. సర్వేయర్ గౌరీశంకర్ తదితరులున్నారు.

రాజుగారి పేటవీధి జలమయం

సొంపేటలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి పట్టణంలోని రాజుగారి పేటవీధి జలమయమైంది. నీరు నిలిచి పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

తప్పిన ప్రమాదం

వజ్రపుకొత్తూరు రూరల్: వరద నీరు భారీగా బెండిగెడ్డలోకి చేరి నువ్వలరేవు ఉప్పుటేరు ఉప్పొంగింది. గ్రామాన్ని తాకుకుంటూ వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మత్స్యకారులు అందోళన చెందారు. అలాగే వరద నీరు రోడ్లు, పాఠశాల అవరణ, పంట పొలాల్లోకి చేరింది. మత్స్యకార గ్రామాలైన నువ్వలరేవు, మంచినీళ్లపేట గ్రామాల్లో సోమవారం అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ వంక రాజు పర్యటించి మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం తీరం దాటడంతో ముప్పుతప్పిందని అధికారులు వెల్లడించారు.


కంచిలి: ఎస్సీ కాలనీలోకి ప్రవహిస్తున్న వరదనీరు


వజ్రపుకొత్తూరు రూరల్:నువ్వలరేవు గ్రామాన్ని తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పలాస డివిజన్‌లో..

కవిటి: వాయుగుండం ప్రభావంతో కుంభవృష్టిగా కురిసిన వర్షాలకు ఉద్దానం తడిసిముద్దయింది. పలాస డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో భారీ వర్షపాతం నమోదు అయింది. తాజాగా కురిసిన వర్షాలకు కవిటి మండలం నెలవంక, కపాసుకుద్ధి, పుటియాదళ, కవిటి, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, బిగొనపపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాల్లో వరి పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం బీల ప్రాంతాల్లో వరిపొలాల్లో ఉన్న నీటిని తక్షణమే తొలగించకుంటే వరిచేను కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కంచిలి: భైరిపురం జంక్షన్ వద్ద నిలిచిన నీటి తొలగింపుకు డ్రైనేజీ ప్లేట్లను తొలగిస్తున్న సిబ్బంది


కంచిలి: నారాయణబట్టి వద్ద నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి బి.ధనుంజయ


సోంపేట: రాజుగారి పేటలో నిలిచిపోయిన వరద


వజ్రపుకొత్తూరు రూరల్: మంచినీళ్లపేట తీరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఉదయ్‌కుమార్, వంక రాజు


వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షం నీరు


కవిటి:పుటియాదళ బీలలో నీటమునిగిన వరిపైరు.


సోంపేట: పైడిగాం ప్రాజెక్టు పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.అప్పలస్వామి


కవిటి:కొబ్బరితోటల్లో నిలిచిన వర్షపునీరు


కవిటి:ప్రగడపుట్టుగవాలీబాల్ మైదానంలో నిలిచిన వరదనీరు

క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీబాయి

టెక్కలి: తుఫాన్ ప్రభావంతో ప్రబలే అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి సూచించారు. టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో సోమవారం పర్యటించి అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

నేడు కుమారన్న వర్ధంతి సభ

పలాస: కామ్రేడ్ పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న 26వ వర్ధంతి సభను పలాస మండలం లొత్తూరు పంచాయితీ పెదగంతరు గ్రామంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కామ్రేడ్ కుమారన్న, జయక్క స్మారక కమిటీ తరపున పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమారన్న 26 ఏళ్ల క్రితం పెదగంతరు గ్రామంలో పోలీసుల చేతిలో అమరులయ్యారని గుర్తుచేశారు. తన 50 ఏళ్ల సుదీర్ఘ కాలం అజ్ఞాతలోనే ఉంటూ గిరిజనుల హక్కుల కోసం పోరాడినట్టు పేర్కొన్నారు.

పెట్టుబడి సాయం అందజేయాలి


రావివలస వీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా పెట్టుబడి సాయం రూ. 20 వేలు తక్షణమే అందజేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎస్.షణ్ముఖరావు, పి.సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం రావివలస, అయోధ్యపురం గ్రామ సచివాలయాల అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెట్టుబడి సాయం అందించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, నష్టపోయిన పంటలకు బీమా, సమగ్ర ఉచిత పంటల బీమా అందజేయాలని, జీడి పంటకు మద్దతు ధర ఇవ్వాలని, రూ. రెండు లక్షల వరకు రైతులకు రుణ మాఫీ చేయాలని, ఎరువులు, పురుగు మందులు వాస్తవ ధరలను అందుబాటులోకి తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఐ.మల్లేశ్వరరావు, సర్లాన సుధాకర్, పి.కృష్ణారావు, ఎస్.గజపతిరావు, దిలీప్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జేసీఐ వారోత్సవాలు


అనాథలకు అన్నదానం చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన జేసీఐ (జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా) స్వచ్ఛంద సంస్థ వారోత్సవాలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతినిధులు బస్టాండ్ కూడలిలో పతాకావిష్కరణ చేశారు. అనంతరం కంచిలి మండలం మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్‌లో ఉన్న అనాథలకు అన్నదానం చేశారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు షణ్ముఖరావు, అనుదీప్, స్వరూప్‌కుమార్, ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

గ్రామాల్లో ఆర్డీవో పర్యటన


ఇద్దివానిపాలెం వద్ద వరద తీవ్రతను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్, ఎమ్మెల్యే అశోక్

కవిటి: భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పరిస్థితిని అంచనా వేసేందుకు పలాస ఆర్డీవో భరత్‌నాయక్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత కవిటి తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో వర్షాలపై సమీక్షించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి ఇద్దివానిపాలెంలో వరదనీటి ప్రవాహం పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పునరావాసకేంద్రాల్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అప్పలస్వామి, తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ధనంజయమజ్జి, హెచ్ఓ పి.మాధవీలత, మండల ఇంజినీర్ పి.ప్రవీణ్, ఎస్ఐ కె.రాము, ఏపీఎం కె.గోవింద్, ఏపీవో టి.మోహన్‌రావు ఉన్నారు.

పబ్లిసిటీ కోసం ప్రజలను బలి చేశారు

- చంద్రబాబు కావాలనే బుడమేరు వరద ప్రవాహాన్ని ప్రజల వైపు మళ్లించారు
- సహాయక చర్యల్లో ప్రభుత్వం ఘోర వైఫల్యం
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: తుఫాన్ ప్రభావంతో విజయవాడ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ముప్పు ఉందని తెలిసినప్పటికీ వారిని అప్రమత్తం చేసే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వార్థ పూరితంగా ఆలోచన చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో బుడమేరు నుంచి ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ చంద్రబాబు తన ఇళ్లు, ఏబీఎస్ రాధాకృష్ణ పవర్ ప్లాంట్ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రజలు నివసిస్తున్న కాలనీల వైపు వరద నీటిని మళ్లించారని దుయ్యబట్టారు. వరద నీటి వలన విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది నిరాశ్రయులుగా మారారని.. వారిని ఆదుకునే విషయంలో చంద్రబాబుతో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు పబ్లిసిటీ కోసం పాకులాడారని ఎద్దేవా చేశారు. ఒక వైపు వరద నీటి ప్రవాహం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బాధితులు గగ్గోలు పెడుతున్నా వారిని పట్టించుకోకుండా ఫొటోలకు ఫోజులిచ్చే కార్యక్రమాలతో అధికారులను సీఎం, మంత్రుల చుట్టూ తిప్పించుకున్నారని తిలక్ అన్నారు. బాధితులకు కనీసం మంచినీరు, ఆహారం అందించలేని అసమర్థత ప్రభుత్వం రాష్ట్రంలో ఉందన్నారు. బాధితులకు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు అందక మునుపే విరాళాల రూపంలో దండుకునే పనిలో పడ్డారని ఆరోపించారు. వరదలు వచ్చినపుడు తీసుకునే జాగ్రత్తలపై ముందస్తు అవగాహన లేకుండా కేవలం ప్రజల్ని బలి చేయడానికే చంద్రబాబు పన్నాగం పన్నారన్నారు. సహాయక చర్యల్లో హడావుడి చేయడమే తప్పా సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్న ప్రజల్ని ఆదుకునే చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రచారం పిచ్చితో ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో దూర దృష్టితో విజయవాడలో నిర్మాణం చేసిన రిటైనింగ్ వాల్‌తో ఈ రోజు ఎంతో మంది వరద ప్రమాదం లేకుండా బతికి బయట పడ్డారని తిలక్ గుర్తు చేశారు. అంతే కాకుండా జగన్ రూపకల్పన చేసిన ఎండీయూ వాహనాలు వరద బాధితుల్ని ఆదుకునేందుకు ఆసరాగా నిలిచాయన్నారు. ప్రజలను బలి చేసే పబ్లిసిటీ చంద్రబాబుకు అలవాటని.. గతంలో ఇదే మాదిరిగా పుష్కరాలకు పబ్లిసిటీ కోసం ఎంతో మంది ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారని గుర్తు చేశారు.

బాధితుడికి సాయం అందజేత


బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: తుఫాన్ ప్రభావంతో స్థానిక భూలోకమాత వీధిలో ఇంటి గోడ కూలిపోవడంతో నిరాశ్రయులైన నాగవంశం శ్యామలరావు కుటుంబానికి జనసేన పార్టీ నాయకుడు కూరాకుల యాదవ్ తనవంతు సాయం అందించారు. సోమవారం నిత్యావసర సరుకులు, బట్టలు సమకూర్చారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బెహరా కాశీ, డి.ధర్మారావు, బి.ప్రసాద్, కె.అరుణ్, కామరాజు, కృష్ణ, నరేంద్రతో పాటు వీఆర్ఓ చత్రపతి ఉన్నారు.

టీ దుకాణం వద్ద తగాదా

కాశీబుగ్గ:

పలాస జాతీయ రహదారి కోసంగిపురం కూడలిలోని ఓ టీ దుకాణం వద్ద ఆదివారం అర్థరాత్రి ఒంటిగంట సమయంలో తగాద చోటు చేసుకుంది. అనుమతులు లేకుండా అర్ధరాత్రి వరకు సిగరెట్లు, ఖైనీ, గుట్కాలు అమ్ముతుండటంతో జంటపట్టణ వాసులు ఆ సమయంలో అక్కడికి చేరుకుంటున్నారు. ఈ తరుణంలో దుకాణదారుడుకు, కొనుగోలుదారుడుకు మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. రాత్రి ఒంటిగంటన్నర సమయంలో కాశీబుగ్గ పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సద్దుమణిగించారు.


గొడవను అడ్డుకుంటున్న పోలీసులు

వరద బాధితులకు రూ. లక్ష విరాళం

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితుల సహాయం కోసం కాశీబుగ్గకు చెందిన వ్యాపారి పెంట బాల రూ.లక్ష విరాళంగ ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు సోమవారం అందజేశారు. నాయకులు లొడగల కామేశ్వరరావు, దాత కుటుంబ సభ్యులు ఉన్నారు.


ఎమ్మెల్యే శిరీషకు చెక్ అందజేస్తున్న దృశ్యం

అధికారులకు అభినందనలు


సీఐ చిన్నంనాయుడుని అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సైలు ఇ.చిన్నంనాయుడు, శ్రీనివాసరావులను పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు అన్వేష్, పాస్టర్లు బిమ్మెబెహర, ప్రకాష్, గోపాల్‌బాబు, బాబూరావు ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతోనే నష్టం

టెక్కలి: విజయవాడలో వరదలకు వలంటీర్ వ్యవస్థను ఉపయోగించుకోకపోవడంతో పెద్ద నష్టం వాటిల్లిందని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తారు వెంకటరమణ అన్నారు. ఎంతో భవిష్యత్ ఆలోచనతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడిడ రూపకల్పన చేసిన వలంటీర్ వ్యవస్థను ప్రస్తుత సీఎం చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు.

చిరస్మరణీయుడు మావో

పలాస:

నూతన చైనా నిర్మాత మావో చిరస్మరణీయుడని, ప్రపంచ విప్లవాల వేగుచుక్కని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని కొత్తారింగ్ తాళబద్రలో సోమవారం మావో 48వ వర్ధంతి సభను నిర్వహించారు. అతని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం ప్రపంచలోని అన్నిదేశాలకు దిక్సూచి అయిందన్నారు. వ్యవసాయక దేశాల్లో విప్లవాన్ని ఎలా తీసుకురావాలనేది మావో రచనల్లో మనకు తెలుస్తుందన్నారు. శ్రీకాకుళం గిరిజన సాయుధపోరాటం కూడా ఆయన ఆలోచనల నేపథ్యంలోనే సాగిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, సవర సోమేశ్వరరావు, సవర బంగ్లా కుమార్ పాల్గొన్నారు.


మావోకు నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు ముందస్తు లోక్‌అదాలత్

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ముందస్తు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు ముందు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో సైతం కేసులను పరిష్కరించుకోవచ్చునని.. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- డీఆర్వో అప్పారావు


ఇచ్ఛాపురం రూరల్: బహుదానదిలో వరద ఉధృతిను పరిశీలిస్తున్న డీఆర్వో అప్పారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: వాయుగుండం నేపథ్యంలో తీర ప్రాంతాల్లో మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు అన్నారు. మండలంలోని డొంకూరు, బూర్జపాడు మత్స్యకార తీర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు, మత్స్యకారులతో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తుఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలించారు. రాత్రి సమయంలో నిర్వాసితులు వస్తే వారికి అవసరమైన భోజనం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో కలసి బహుదానదిలో పారుతున్న వరదనీటిని అంచనా వేశారు. ఒడిశా భగలట్టీ డ్యామ్‌లో నీటి నిల్వను ఒడిశా ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్యామ్ గేట్లు ఎత్తివేస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండల ప్రత్యేకాధికారి చల్లా శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్, అగ్నిమాపకాధికారి ఆర్.సూర్యారావు, ఇరిగేషన్, వ్యవసాయ, వైద్య, గ్రామ సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

టెక్కలి రూరల్: వర్షాలతో స్థానిక అయ్యప్పనగర్‌లోని బీసీ బాలురు వసతి గృహం సమీపంలో మురుగునీరు నిలిచిపోయింది. దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన వసతి గృహం సిబ్బంది సోమవారం రాత్రి ఇంజన్‌ను ఏర్పాటు చేసి నీటిని తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.


టెక్కలి రూరల్: ఇంజన్‌తో మురుగునీటిని తోడుతున్న దృశ్యం

హుకుంపేటలో తొలగిన ఇక్కట్లు

వజ్రపుకొత్తూరు: భారీ వర్షాలకు హుకుంపేటలోని సూరాడవాని వీధిలో వరద నీరు భారీగా చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి జేసీబీ యంత్రం ఏర్పాటు చేసి వరద నీటిని పల్లపు ప్రాంతానికి సోమవారం మళ్లించారు. సర్పంచ్ మామిడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ రెడ్డి , వంక రామరావు, మోహనరావు పాల్గొన్నారు.